నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, ఆదివారం 23 ఫిబ్రవరి 2025 VIKARABAD

## తాను మరణిస్తూ.. పలువురికి వెలుగు



ఖైరతాబాద్, ఫిబ్రవరి 22 : తాను మరణించినా పలువురి జీవితాల్లో వెలుగులు నింపాడో వ్యక్తి. జీవన్‌దాన్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీభూషణ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా బోడుప్పల్ హేమానగర్‌కు చెందిన ఓరుగంటి సుధాకర్ (54) ఓ ప్రైవేట్ దవాఖానలో ఆపరేషన్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. వారం రోజుల కిందట విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా, అపస్మారక స్థితిలో కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా, వైద్యులు ఈ నెల 21న బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. జీవన్‌దాన్ కౌన్సెలింగ్‌తో కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు సుధాకర్ శరీరం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలను సేకరించారు.

# అందని సబ్సిడీ

## అయోమయంలో లబ్ధిదారులు

- ఆరంభంలోనే మహాలక్ష్మి పథకానికి తూట్లు
- రంగారెడ్డి జిల్లాలో అర్హులు 2,08,200 మంది..
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు



**వంట గ్యాస్ సబ్సిడీ అందకపోవడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. జిల్లాలో 13,39, 850 మంది గ్యాస్ వినియోగదారులు ఉండగా.. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా తెల్లరేషన్ కార్డు కలిగిన 2,08,200 మందిని మహాలక్ష్మి పథకానికి అర్హులుగా అధికారులు ఎంపిక చేశారు. వీరికి గ్యాస్ సిలిండర్‌పై రావాల్సిన సబ్సిడీ డబ్బుల కోసం బ్యాంకుల కోసం తిరుగుతున్నారు.**

రంగారెడ్డి, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ అందులో భాగమైన మహాలక్ష్మి పథకానికి ఆరంభంలోనే తూట్లు పొడిచింది. ఈ పథకం కింద సబ్సిడీ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ ఇవ్వకపోవటంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీ ఎన్నికల ముందు విస్తృతంగా ప్రచారం చేశారు. వారి మాటలను నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేశారు. పవర్‌లోకి వచ్చిన తర్వాత సర్కార్ అర్హుల జాబితాను విడుదల చేయగా.. జిల్లాలో సుమారు రెండు లక్షలకు పైగా లబ్ధిదారులున్నారు. వారందరూ గ్యాస్ సిలిండర్ పై రావాల్సిన సబ్సిడీ డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

### జిల్లాలో 13,39,850 గ్యాస్ కనెక్షన్లు

జిల్లాలో 13,39,850 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. అందులో ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా తెల్లరేషన్ కార్డు కలిగిన 2,08, 200 మందిని మహాలక్ష్మి పథకానికి అర్హులుగా అధికారులు ఎంపిక చేశారు. వీరందరికీ మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ సబ్సిడీ రావాల్సి ఉన్నది. ఇందుకోసం వారు మండల పరిషత్ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. వంట గ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం అందించిన సబ్సిడీ రూ. 40.71 పోను మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. కానీ, ఆ సబ్సిడీ మాత్రం మహిళల ఖాతాల్లో జమ కావడంలేదు.

### మళ్లీ కట్టెలపొయ్యిల వైపే..

ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు సబ్సిడీ ఇవ్వకపోవటంతో పేద, మధ్యతరగతి మహిళలు మళ్లీ కట్టెలపొయ్యిల వైపే మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీ చెల్లించకపోవడంతో చాలామంది మహిళలు గ్యాస్ కొనటాన్ని మానేస్తున్నారు.

### నేటికీ అందని గ్యాస్ సబ్సిడీ



అసెంబ్లీ ఎన్నికలకు ముందు వంటగ్యాస్‌ను సబ్సిడీపై అందిస్తామన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు.. పవర్‌లోకి రాగానే లబ్ధిదారులకు చెల్లించకపోవడం దారుణం. 14 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలందరూ అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు కావడం లేదు. **-పవిత్ర, ఇబ్రహీంపట్నం**

### ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ అమలు కావడంలేదు

వంట గ్యాస్‌ను సబ్సిడీ కింద ఇస్తామన్న రేవంత్ సర్కార్ ఇప్పటికీ ఇవ్వడంలేదు. ఎన్నికలకు అలవికాని హామీలిచ్చి.. అధికారంలోకి రాగానే వాటికి మంగళం పడుతున్నది. ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటి కూడా సక్రమంగా అమలు కావడంలేదు. **-బొమ్మరాజు జయమ్మ, మీర్‌ఖాన్‌పేట్**

# సూత్రధారి ఎవరు..?

## నకిలీ పత్తి విత్తనాల వెనుక ఉన్నదెవరు..?

- ప్రధాన నిందితుడిని పట్టుకోవడంలో వైఫల్యం
- మామూళ్ల మత్తులో జోగుతున్న పోలీసులు, వ్యవసాయాధికారులు
- ఏటా వందల క్వింటాళ్ల పత్తి విత్తనాలు సీజ్
- వికారాబాద్ జిల్లాలో యథేచ్ఛగా దందా
- నకిలీ విత్తనాలతో నష్టపోతున్న రైతులు



నకిలీ పత్తి విత్తనాలను పరిశీలిస్తున్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి (ఫైల్)

వికారాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : నకిలీ పత్తి విత్తనాల దందా జిల్లాలో గుట్టు చప్పుడు కాకుండా యథేచ్ఛగా సాగుతున్నది. ప్రతి ఏటా కొడంగల్, తాండూరు ప్రాంతాల్లో ఈ విత్తనాలు పట్టుపడుతున్నా అధికారులు నామమాత్రంగా కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా.. వ్యవసాయ, పోలీసుశాఖల అధికారులు మాత్రం తుతూ మంత్రంగా తనిఖీలు చేస్తూ చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జిల్లాలోని పెద్దేముల్ మండలంలో రూ. 10 లక్షల విలువైన నకిలీ విత్తనాలను సీజ్ చేసిన అధికారులు కర్ణాటక ప్రాంతానికి చెందిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ప్రధాన సూత్రధారి స్థానిక వ్యవసాయ, పోలీసు అధికారులకు తెలిసే దర్జాగా దందాను కొనసాగిస్తున్నాడని..అతడు ఇచ్చే డబ్బులకు కక్కుర్తి పడి పోలీసులు పట్టుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో మూడుసార్లు పట్టుబడిన వ్యక్తే జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నారని.. అయినా ఇప్పటివరకు అతడిపై పీడీ యాక్ట్ అమలు చేయకపోవడంపై స్థానిక పోలీసులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు గతంలో తన పేరిట ఉన్న ఫర్టిలైజర్ దుకాణాన్ని అధికారులు మూసేయడంతో మరొకరి పేరిట లైసెన్స్ పొంది నకిలీ పత్తి విత్తనాల దందాను కొనసాగిస్తున్నాడని.. ఇదంతా తెలిసి కూడా అతడికి లైసెన్స్ మంజూరు చేయడంపై స్థానిక వ్యవసాయాధికారులపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. గతంలో జిల్లా వ్యవసాయాధికారిగా పనిచేసిన గోపాల్ సదరు అక్రమార్కుడి కొత్త షాపునకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల నుంచి ఎంత ఒత్తిడి వచ్చినా లైసెన్స్ మంజూరు చేయలేదు. ఆయన బదిలీ కాగానే వచ్చిన కొత్త అధికారితో స్థానిక అధికారులు లైసెన్స్ ఇప్పించినట్లు సమాచారం.

### కర్ణాటక నుంచి..

ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొందరు కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా ప్రాంతంలో నివాసముంటున్నారు. వారిలో కొంతమంది నకిలీ పత్తి విత్తనాల దందా చేస్తూ.. అక్రమంగా జిల్లాలోని కొడంగల్, తాండూరు తదితర ప్రాంతాలకు వాటిని తరలిస్తున్నారు. నకిలీ పత్తి విత్తనాల దందా నడిపిస్తున్న వారి వివరాలు తెలిసినా.. పోలీసులు కేవలం వారి వద్ద లభించిన నకిలీ విత్తనాలను మాత్రమే సీజ్ చేస్తూ జిల్లాకు అక్రమంగా నకిలీ విత్తనాల తరలింపును అడ్డుకట్ట వేయడం లేదనే ఆరోపణలున్నాయి. పోలీసుల నిఘా వైఫల్యంతో చెక్‌పోస్టులు నామమాత్రంగా మారాయనే విమర్శలున్నాయి. సరిహద్దులు దాటి యథేచ్ఛగా నకిలీ పత్తి విత్తనాలు జిల్లాలోకి వస్తున్నాయి.

### నకిలీ విత్తనాలతో నష్టపోతున్న రైతన్న

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతు ఏదో రకంగా నష్టపోతూనే ఉన్నాడు. ముఖ్యంగా పత్తి రైతు విత్తనాలు మొదలుకొని పత్తిని విక్రయించే వరకూ మోసపోతున్నాడు. పంటల సాగుకు చేసిన అప్పులు, మరోవైపు నకిలీ విత్తనాల బారిన పడి అప్పుల్లో కూరుకుపోతున్నాడు. జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల దందా సంబంధిత అధికారులకు తెలిసే నడుస్తున్నదన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకు అధికారికంగా 200 క్వింటాళ్ల వరకు నకిలీ పత్తి విత్తనాలను సీజ్ చేసినప్పటికీ.. గుట్టుచప్పుడు కాకుండా వందల క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు అమాయక రైతులకు చేరాయి. 2019లో 47.97 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు, 2020లో 4.07 క్వింటాళ్లు, 2021లో 85.72, 2022లో 24.64, 2023లో 11.45, 2024లో 64 క్వింటాళ్లు, ప్రస్తుతం ఈ ఏడాది ఇప్పటివరకు 1.5 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను అధికారికంగా సీజ్ చేశారు



కష్టపడి పనిచేసే ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, ఉద్యోగుల గుర్తింపునకు వారి పనితీరే ప్రామాణికమని ఆబ్కారీ శాఖ ఈడీ కమలాసన్‌రెడ్డి అన్నారు. శనివారం నాంపల్లిలోని ఆబ్కారీభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్, రంగారెడ్డి, ధూల్‌పేట ప్రాంతాల్లో మత్తు పదార్థాలను అరికట్టడంలో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి కమలాసన్‌రెడ్డి నగదు పురస్కారాలను అందజేశారు.

**-సిటీబ్యూరో, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ)**

# భూసేకరణ కాకుండానే.. టెండర్లా?

- కేబీఆర్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి బల్దియా చర్యలు
- భూసేకరణపై క్లారిటీ రాకుండానే..టెండర్లు
- వీఐపీ జోన్ కావడంతో భూసేకరణపై వీడని సందిగ్ధం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా చెప్పుకుంటున్న కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం గందరగోళంగా మారింది. నిజానికి ఏ ప్రాజెక్టు అయినా మొదలుపెట్టాలంటే.. ముందుగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాత పనులు చేపట్టేందుకు టెండర్లను పిలుస్తారు. కానీ ఈ ప్రాజెక్టు విషయంలో కేవలం హడావుడి చేసేందుకు భూసేకరణపై స్పష్టత రాకముందే.. పనులు చేపట్టేందుకు టెండర్లను జీహెచ్‌ఎంసీ ఆహ్వానించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రెండు ప్యాకేజీల్లో కేబీఆర్ పార్క్ ఎంట్రెన్స్ గేటు నుంచి జూబ్లీ చెక్ పోస్టు వరకు, బసవ తారకం హాస్పిటల్ మీదుగా అగ్రసేన్ విగ్రహం మీదుగా అండర్ పాస్, ఫ్లై ఓవర్లను రూ.1090 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు బల్దియా టెండర్లు పిలిచింది. ఫిబ్రవరి 27 నుంచి టెండర్ ప్రక్రియ మొదలు కానుండగా, మార్చి 26తో ప్రక్రియ ముగించేందుకు బల్దియా చర్యలు చేపట్టింది. అయి తే అత్యంత కీలకమైన ఈ ప్రాజెక్టులో భూసేకరణపై ఎలాంటి స్పష్టత రాకుండా పనులు ఎలా మొదలుపెడతారనేది ఆసక్తిగా మారింది.

### దాదాపు 150 నివాసాలు

హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్కు ఫ్లైఓవర్లు, అండర్ పాసుల నిర్మాణంలో అత్యంత క్లిష్టమైనది భూ సేకరణ ప్రక్రియ. వాస్తవంగా ఏ ప్రాజెక్టు మొదలుపెట్టాలన్నా.. ముందు భూసేకరణ పూర్తి చేసిన తర్వాతనే.. పనులు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానిస్తారు. కానీ ఈ ప్రాజెక్టు విషయంలో క్లారిటీ లేకుండానే హడావుడిగా టెండర్లను పిలవడం ఎందుకనేది ఇప్పుడు చర్చ నడుస్తోంది. ప్రస్తుతం పాత రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్(ఆర్‌డీపీ) పరిగణనలోకి తీసుకుని కొత్త ఆర్‌డీపీ ప్లాన్ సిద్ధం చేశారు. గత ఆర్‌డీపీలో దాదాపుగా 105 నివాసాలు ఉన్నట్లు తేలింది. అయితే ఈ నివాసాల నుంచి ఆస్తుల స్వాధీనం అధికారులకు తలకు మించిన భారమేనని చెప్పాలి. అంతేకాకుండా భూసేకరణపై ఇప్పటికే వివిధ న్యాయస్థానంలో మూడు కేసులు ఉండడం వీటిపై ఎలాంటి క్లారిటీ రాకుండానే టెండర్లను పిలవడం వెనుక అంతర్యమేమిటనేది తెలియాల్సి ఉంది.

# వారి వల్లే స్టేషన్ పరువు పోతున్నది!

- మహిళా కానిస్టేబుళ్లను బూతులు తిట్టిన సీఐ
- సీఐ ప్రవర్తనతో బోరుమన్న కానిస్టేబుళ్లు
- పీఎస్ వేదికగా సీఐ వర్సెస్ డీఐ
- సీపీని కలుస్తామంటున్న మహిళా కానిస్టేబుళ్లు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో కొత్తగా ఏర్పాటైన పోలీస్‌స్టేషన్ అది. అక్కడ పోలీసు అధికారుల మధ్య పచ్చగడ్డేస్తే భగ్గుమంటున్నది. సీఐ వర్సెస్ డీఐ పోరు కానిస్టేబుళ్ల వైపు తిరిగింది. ఉన్నతాధికారుల పర్యటన సందర్భంలో జరిగిన గొడవ ఆ ఠాణా అధికారులు బహిరంగంగానే తిట్టుకునే సందర్భం కనిపించింది. నువ్వేం పనిచేస్తున్నవ్.. అంటే నువ్వేం చేస్తున్నవ్ అంటూ ఒకరిపై ఒకరు అనుకోవడమే కాకుండా చూసుకుందాం రా అంటూ సవాల్ విసురుకున్నారు. స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు చూస్తుండగానే ఈ సంఘటన జరిగింది. రెండు రోజుల కిందట జరిగిన ఈ ఘటనలో సీఐ గొడవకు దిగిన సందర్భంలో మహిళా కానిస్టేబుళ్లతో అసభ్యంగా మాట్లాడడంతో వారు తిరగబడ్డారు. అసలు మమ్మల్ని అనడానికి నువ్వెవరూ అంటూ సీరియస్ అయ్యారు. మా క్యారెక్టర్లను కించపరిస్తే ఊరుకునేది లేదంటూ గొడవకు దిగారు. అయినా సీఐ తన పంథా మార్చుకోకుండా అదే రీతిలో బూతులు తిట్టడంతో ఎట్టి పరిస్థితుల్లోనూ సీఐపై హైదరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయాలని వారు డిసైడయ్యారు.

### మహిళలని కూడా చూడకుండా..!

ఈ పోలీస్‌స్టేషన్ ఏర్పాటైన నాటి నుంచీ స్టేషన్ ఆఫీసర్లపై వివాదాలు ఉన్నాయి. ఇప్పుడు ఉన్న ఆఫీసర్ కూడా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌తో గొడవ పడడమే కాకుండా ఏం పనిచేస్తున్నావ్ అంటూ గొడవకు దిగారు. డీసీపీ పర్యటన నేపథ్యంలో ఆ పరిధిలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో వాహనాల చెకింగ్ తర్వాత సంఘటన జరిగింది. ఇద్దరు అధికారులు గొడవ పడుతున్న సమయంలో మహిళా కానిస్టేబుళ్ల వల్లే ఈ స్టేషన్ ఇలా తయారైందని అంటూనే వారిపై అసభ్యంగా మాట్లాడుతూ బూతులు తిట్టడంతో గొడవ ముదిరింది. తమకు సంబంధంలేని గొడవలో లాగడమే కాక బూతులు తిట్టడమేంటంటూ మహిళా కానిస్టేబుళ్లు ప్రశ్నించారు. దీంతో ఒక మహిళా కానిస్టేబుల్‌తో మరింత అసభ్యంగా మాట్లాడిన సీఐ నువ్వెవరికీ చెప్పుకొంటావో చెప్పుకో పో అంటూ వెళ్లిపోయాడు. తనకు పై అధికారి అండదండలు ఉన్నాయన్న కారణంగా సబార్డినేట్స్‌ను ఇలా వేధిస్తారని వారు పేర్కొన్నారు. ఈ సీఐపై మొదటి నుంచి ఆరోపణలున్నాయి. కేసుల నమోదులో ఉదాసీనతతోపాటు, ప్రైవేట్ పంచాయితీలు, నెలవారీ మమ్మూళ్లతో తన పై అధికారులను ప్రసన్నం చేసుకుంటాడని చెప్పుకొంటున్నారు.

అయితే తమ పట్ల సీఐ మాట్లాడిన తీరుపై మహిళా కానిస్టేబుళ్లు ఏసీపీని కలిశారు. ఆయన మాట్లాడతానంటూ భరోసా ఇచ్చి సీఐతో మాట్లాడే ప్రయత్నం చేసినా ఆయన దగ్గర కనీసం తాను తప్పుగా మాట్లాడానన్న ఫీలింగ్ కూడా లేదని, మరోసారి కూడా వారి వల్లే పోలీస్‌స్టేషన్ ఇజ్జత్ పోతున్నదని కామెంట్ చేశారని.. ఈ విషయంపై తాము పోలీస్ కమిషనర్‌ను కలిసి తమ సమస్యలు చెప్పుకొంటామని మహిళా కానిస్టేబుళ్లు పేర్కొన్నారు.
సీఐ వేధింపులతో తాము మానసికంగా చాలా ఇబ్బంది పడుతున్నామని.. తమను వ్యక్తిగతంగా, ఉద్యోగపరంగా సీఐ వేధిస్తున్నారంటూ మహిళా కానిస్టేబుళ్లు సోమవారం సీపీ సీవీ ఆనంద్‌ను కలిసి సీఐ వ్యవహార శైలిపై ఫిర్యాదు చేయాలని డిసైడ్ అయినట్లు తెలిసింది.

# ఓల్డ్ సిటీ మెట్రోకు అడ్డంకులు

## చారిత్రక కట్టడాలను పరిరక్షించాలంటూ పిటిషన్లు

## మెట్రో విస్తరణలో మరింత జాప్యం



సిటీ బ్యూరో, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : ఓల్డ్ సిటీ మెట్రోకు గ్రహణం వీడడం లేదు. కొంతకాలంగా ఈ ప్రాజెక్టుకు అన్ని అడ్డంకులే ఎదురవుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం ఓల్డ్ సిటీ మెట్రోను చాంద్రాయణ గుట్ట వరకు విస్తరించేలా పనులు చేపట్టింది. కానీ ఈ మార్గంలో కోల్పోతున్న చారిత్రక కట్టడాలు మెట్రో నిర్మాణానికి ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయి. ప్రాజెక్టును చేపట్టే క్రమంలో అధ్యయనం చేసిన హైదరాబాద్ మెట్రో సంస్థ వెయ్యికి పైగా చారిత్రక, ఆధ్యాత్మిక, మతపరమైన కట్టడాలను గుర్తించింది. ఈ క్రమంలో వాటిని తొలగించి, ప్రాజెక్టు చేపట్టేలా నిర్వాహకులతో సంప్రదింపులు జరిపినా..ప్రాజెక్టు ముందుకు పోవడం లేదు. ప్రాజెక్టు నిర్మాణానికి కీలకమైన భూసేకరణ తలకు మించిన భారంగా మారుతున్నది. ప్రైవేట్ ఆస్తులను సేకరించే క్రమంలో ఎదురైన ఇబ్బందులను సంప్రదింపులతో తొలగిస్తున్నా... మతపరమైన, చారిత్రక కట్టడాల విషయంలో అడుగు ముందుకు పడడం లేదు. చారిత్రక కట్టడాలను పరిరక్షించాలంటూ కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు పలువురు వేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఈ కట్టడాలకు ప్రమాదం పొంచి ఉందని వాదిస్తున్నారు.

### విస్తరణకు వ్యతిరేకంగా..

హైదరాబాద్ మెట్రో విస్తరణకు వ్యతిరేకంగా కోర్టులను ఆశయిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, హైదరాబాద్ మెట్రో ఎండీ, వక్ఫ్ బోర్డు సీఈవోలను ప్రతివాదులుగా చేర్చుతూ... పాతబస్తీలో మెట్రో నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తమవుతున్నది. చారిత్రక కట్టడాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణం చేపడుతున్నారని పేర్కొంటూ.. పాతబస్తీలో మెట్రో నిర్మాణంపై పలువురు కోర్టును ఆశ్రయించారు.

### తెలంగాణ వారసత్వ చట్టం 2017 ప్రకారం..

తెలంగాణ వారసత్వ చట్టం 2017 ప్రకారం చారిత్రక కట్టడాలను రక్షించాలని కోరుతున్నారు. పాతబస్తీ ప్రతిపాదిత మెట్రోమార్గం సమీపంలో చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్, పురానా హవేలి, మొఘల్‌పురా సమాధులు వంటి చారిత్రక కట్టడాలు ఉన్నాయని వాదనలు వినిపిస్తున్నారు. మెట్రో రైలు నిర్మాణం కారణంగా ఈ స్మారక చిహ్నాలకు నష్టం జరిగే ప్రమాదం ఉందంటున్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ కోసం పనులు చేపట్టే ముందు నిపుణుల బృందం పర్యవేక్షణలో జరగాలని కోరుతున్నారు. లేదంటే ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### కొనసాగుతున్న భూసేకరణ

ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణలో కీలకమైన భూసేకరణ పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 7.5 కిలోమీటర్ల పొడవైన మెట్రోను ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మించనున్నారు. ఫేస్-2లో ఇదీ మొదటి కారిడార్ కానుండగా ప్రాజెక్టు కోసం 1100 ఆస్తులను సేకరించేందుకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో 800 ఆస్తులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను పలు దఫాలుగా జిల్లా రెవెన్యూ అధికారులు చేపట్టారు. మొదటి దశ ప్రైవేట్ ఆస్తులకు పరిహారాన్ని చెల్లించడం మొదలైంది. అదే సమయంలో కొన్నిచోట్ల కూల్చివేతలు ప్రారంభించారు. ప్రాజెక్టుకు భూములు స్వచ్ఛందంగా ఇచ్చే యజమానులతో సంప్రదింపులు చేస్తూనే, సమస్యాత్మక ఆస్తుల సేకరణపై అధికారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

## మార్చి 31లోపు

# పరిశీలన పూర్తయ్యేనా?

## హెచ్‌ఎండీఏ పరిధిలో లక్షల్లో ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) హెచ్‌ఎండీఏ పరిధిలో అత్యంత క్లిష్టంగా మారింది. అరకొర సిబ్బంది, రెండు విభాగాల మధ్య సమన్వయంతో జరగాల్సిన వ్యవహారాలతో దరఖాస్తుల పరిశీలన అసాధ్యమనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. నిర్ణీత గడువులోగా పెండింగ్‌లో ఉన్న లక్షల దరఖాస్తులకు మోక్షం కలిగించడం అనుకున్నంత సులభమేమి కాదని తెలుస్తున్నది. ఏడు జిల్లాల్లో విస్తరించిన హెచ్‌ఎండీఏ పరిధిలో మొత్తం 3.60 లక్షల మంది ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కొన్ని దరఖాస్తుల పరిశీలన పూర్తి అయినా.. ఇందులో 30-40 శాతానికి పైగా దరఖాస్తుదారులకు ఫీజులు చెల్లించాలని సమాచారాన్ని అందించారు. అయితే మిగిలి ఉన్న లక్షల దరఖాస్తుల క్రమబద్ధీకరణకు వీలు ఉన్న దరఖాస్తులు ఎన్ని, ఇందులో సాంకేతిక సమస్యలు, ఇతర షార్ట్‌ఫాల్ వంటివి పరిశీలించాల్సి ఉండగా.. మూడు దఫాలుగా జరిగే ఈ ప్రక్రియ అనుకున్నంత వేగంగా, సులభంగా జరిగే అవకాశం కనిపించడం లేదు. దీంతో మార్చి 31లోపు ఆ దరఖాస్తులు క్లియర్ కాకపోతే... ప్రభుత్వం ఇచ్చే 25శాతం రాయితీ అవకాశాన్ని దరఖాస్తుదారులు కోల్పోనున్నారు.

### 80వేలకుపైగా పెండింగ్‌లోనే..

హెచ్‌ఎండీఏ పరిధిలో సుమారు 3.60 లక్షల మంది ఓపెన్ ప్లాట్లను క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 1.16 లక్షల దరఖాస్తులను పరిశీలించారు. వీటిలో 80వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటితోపాటు మరో 75 వేల దరఖాస్తులను షార్ట్ ఫాల్స్ చూపుతూ కొర్రీలు పెట్టారు. ప్రిలిమినరీ ఎలిమినేషన్ ప్రక్రియ ముగియగా.. ఫీజులు చెల్లించిన దరఖాస్తులను పరిశీలించి షార్ట్ ఫాల్స్ పేర్కొంటూ దరఖాస్తుదారులకు సమాచారం ఇస్తున్నారు. ఈ క్రమంలో ఉన్నఫలంగా నిర్ణీత గడువుతో దరఖాస్తులను పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు అయోమయానికి గురవుతున్నారు. దీంతో ఏండ్ల తరబడిగా పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కారించడం అనివార్యంగా మారింది. ఇదంతా హెచ్‌ఎండీఏ సిబ్బందికి పనిభారం పెంచనుండగా, అసలే వేధిస్తున్న సిబ్బంది కొరతతో మరింత జాప్యం జరిగే అవకాశమూ ఉన్నది.